సాక్షి
గుంటూరు
బుధవారం | 29 | జనవరి | 2025



బోల్తా కొట్టిన ఆటో

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : మంగళగిరి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్‌లో మంగళవారం ఆటో బోల్తా కొట్టింది. నలుగురికి గాయాలయ్యాయి.



ఈవీఎంల గిడ్డంగి తనిఖీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గిడ్డంగిని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. భద్రతను పరిశీలించారు.



ఉత్తమ డీఎం అవార్డు

మాచర్ల: మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ఉత్తమ అవార్డును కలెక్టర్ అరుణ్ బాబు నుంచి అందుకున్నారు. బుధవారం వీరాస్వామిని పలువురు అభినందించారు.

పరేషన్ ఏలనో..!



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ వేదికపై మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్సీ అనూరాధ, రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

- 6ఏ కేసులతో సరిపెడతారా?
- పీడీ యాక్ట్ ఎందుకు పెట్టరూ?
- నిలదీసిన ప్రజాప్రతినిధులు
- వాడీవేడిగా డీఆర్సీ సమావేశం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రేషన్ దందాపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. సోమవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశం(డీఆర్సీ)లో రేషన్ దందా, కౌలు రైతుల కార్డులు, విద్యార్థులకు ఇప్పటివరకూ స్టడీ మెటీరియల్స్ ఇవ్వకపోవడంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

రేషన్ దందాపై పలువురు సభ్యులు మాట్లాడుతూ 6ఏ కేసులతో ఎందుకు సరిపెడుతున్నారని ప్రశ్నించారు. పీడీ యాక్ట్ ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు. తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ కుమార్, శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా పౌర సరఫరాల శాఖలో విజిలెన్స్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. రేషన్ బియ్యం అమ్ముకునే లబ్ధిదారులకు కార్డులు రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వాలన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు సీఎం ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని వివరించారు.

నియోజకవర్గాల వారీగా డ్రైవ్

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు ఇచ్చిన వారందరికీ రుణాలు మంజూరు చేసేలా నియోజకవర్గాల వారీగా డ్రైవ్ చేపట్టాలన్నారు. గుంటూరు జిల్లాలో 3.83 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామన్నారు. రేషన్ వాహనాల వినియోగంపై సీఎంతో చర్చిస్తామన్నారు.

ప్రజాప్రతినిధులు ఏం మాట్లాడారంటే..!

- శాసన మండలిలో చీఫ్ విప్ పంచుమూర్తి అనురాధ మాట్లాడుతూ రైతులకు సాగునీరు సక్రమంగా అందించేలా కేడబ్ల్యూ కెనాల్ మరమ్మతులు చేపట్టాలన్నారు. రహదారుల మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.
- రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా ప్రాధాన్య అంశాలపై ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు.
- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రైతు, కౌలు రైతు సమస్యలు ప్రస్తావించారు. టెన్త్ విద్యార్థులకు ఇప్పటివరకు స్టడీ మెటీరియల్ ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.
- ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి మాట్లాడుతూ డోలాస్ నగర్ వాసులకు పట్టాలు ఇచ్చే అవకాశం పరిశీలించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్ విలీనంలో ఉర్దూ స్కూల్స్‌కు మినహాయింపు ఇవ్వాలన్నారు.
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేలా, ఆప్కో ఉత్పత్తులు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ దుగ్గిరాలలో శుభం కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం ఇన్సూరెన్స్ కంపెనీ అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దీపం–2 పథకం నగదు జమలో ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నజీర్ అహ్మద్ మాట్లాడుతూ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వండి

తొలుత ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు సమన్వయంతో వ్యవహరించి కౌలు రైతులకు రుణాలు అందించాలని ఆదేశించారు. త్వరలోనే ప్రభుత్వం కౌలు రైతుల కోసం కొత్త చట్టం తెస్తుందన్నారు. సీసీఆర్సీ కార్డులున్న రైతులకు రుణాలివ్వాల్సిందేనని, మార్చి 15లోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. పీపీపీ విధానంలో సందర్శకులు వచ్చే అన్ని దేవాలయాలు, దర్గాలు, చర్చిలను పర్యాటక సర్క్యూట్‌లో అనుసంధానం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో నిర్వహించే రీజినల్ సెమినర్‌లో జిల్లా సమగ్ర పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అంబటి చిత్రంలో మోదుగుల, అప్పిరెడ్డి, మనోహర్, వజ్రబాబు, ఫాతిమా తదితరులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపు మాదే

- టీడీపీ కుయుక్తులు ఫలించవు
- కార్పొరేటర్ల కొనుగోలుకు ఎమ్మెల్యేల బేరసారాలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపు తమదేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధీమా వ్యక్తం చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 3న స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న అనైతిక విధానాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో వైఎస్సార్ సీపీకి 45 మంది కార్పొరేటర్లు ఉండగా, టీడీపీకి 9 మంది, జనసేనకు ఇద్దరు మాత్రమే ఉన్నారని వెల్లడించారు. ఎన్నికల ముందు, తర్వాత ప్రలోభాలకు గురిచేసి కొందరు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను టీడీపీ లాక్కుందని విమర్శించారు. కార్పొరేషన్లో కూటమికి బలం లేకున్నా.. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. నేరుగా ఎమ్మెల్యేలే కార్పొరేటర్ ఇళ్లకు వెళ్లి బేరసారాలు ఆడుతున్నారని విమర్శించారు. రూ. 30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వేలంపాట పెట్టి మరీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు.

కమిషనర్‌పై అంబటి వ్యంగ్యాస్త్రాలు

ప్రస్తుతం 31 మంది కార్పొరేటర్లు తమ పక్షాన ఉన్నారని అంబటి స్పష్టంచేశారు. ఇటు నుంచి అటు వెళ్లిన వారూ తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కూడా రూ.9 కోట్ల 24 లక్షల అవినీతి డబ్బుతో కార్పొరేటర్లను కొనేందుకు బయలుదేరాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

టీడీపీవి నీచ రాజకీయాలు : ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి నీచ రాజకీయాలు తామెప్పుడూ చూడలేదన్నారు. టీడీపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గెలుపు వైఎస్సార్ సీపీదేనని స్పష్టం చేశారు.

బలం మాదే : మోదుగుల

వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఇప్పటికీ బలమైన పార్టీ వైఎస్సార్ సీపీనేనని పేర్కొన్నారు. టీడీపీ కార్పొరేటర్లు కూటమి సర్కారు తీరుతో అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నుంచి అటు వెళ్లిన వారూ తిరిగి రావాలని కోరారు.

స్టాండింగ్ కమిటీని కైవసం చేసుకుంటాం : మేయర్ మనోహర్

మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోవటం తథ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో టీడీపీ నేతల తీరు ఏ మాత్రం సరికాదన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపును అడ్డుకోలేరు

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఫిబ్రవరి 3న జరిగే స్టాండింగ్ ఎన్నికల్లో 9 మంది నామినేషన్ వేశారని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని వివరించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణయాదవ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేరళలో ఎయిర్‌మెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: భారత వైమానిక రంగంలో ఎయిర్ మెన్ (మెడికల్ అసిస్టెంట్) ఉద్యోగాలకు కేరళ కొచ్చిలోని 14 ఎయిర్‌మెన్ ఎంపిక కేంద్రంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనున్నట్లు యువజన సర్వీసుల శాఖ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇంటర్ బయాలజీ అర్హత కలిగిన అభ్యర్థులు ఫిబ్రవరి 1న, డిప్లొమా, బీఎస్సీ ఇన్ ఫార్మసీ అభ్యర్థులు ఫిబ్రవరి 4న ఉదయం 6 గంటలకు ఎంపిక కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ఎయిర్‌ఫోర్స్ వెబ్ సైట్ ఎయిర్‌మెన్ సెలక్షన్.సీడాక్.ఇన్‌ను సందర్శించాలని సూచించింది.

త్రిసూరులో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కేరళలోని త్రిసూరులో జరిగే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 105 మంది పాల్గొంటున్నారని ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ లాల్ వజీర్ అన్నారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆర్గనైజర్ మాల కొండయ్య, లక్ష్మి, కిషోరి, జయమ్మ, ఉదయ్ హస్పిటల్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మల్లవరపు పవన్ కుమార్



ఏఎన్‌యూ(గుంటూరు): విశాఖపట్నంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరిగిన ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల్లో గుంటూరు జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లవరపు పవన్‌ని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈయన ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ఈయన యూనివర్సిటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా, యూనివర్సిటీ ఇన్‌చార్జిగా, రాష్ట్ర కార్య సమితి సభ్యుడిగా , గుంటూరు జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు.

యార్డుకు 1,20,808 మిర్చి బస్తాలు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు ఈ సీజన్‌లో అత్యధికంగా మంగళవారం 1,20,808 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,612 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.8,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,694 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

'నాట్కో'న్న వైద్య బంధం

- పేద రోగుల సేవల్లో నాట్కోట్రస్టు
- ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు
- గతంలో రూ.50 కోట్లతో జీజీహెచ్‌లో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం
- ఇటీవల రూ.15 కోట్లతో జిల్లాలో కంటి ఆస్పత్రి ప్రారంభం
- రేపు రూ.20 కోట్లతో జీజీహెచ్‌లో మరో క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి (ఫైల్)

గుంటూరు మెడికల్: పేద రోగులకు నాట్కో ట్రస్టు విశేష సేవలందిస్తోంది. 2015 నుంచి ఆ సంస్థ జీజీహెచ్ అభివృద్ధికి కృషి చేస్తోంది. జీజీహెచ్‌కు అనుబంధంగా ప్రత్యేక క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించి ఉచితంగా సేవలందిస్తోంది. ఈ సేవలకు పలుమార్లు కలెక్టర్ ద్వారా ప్రత్యేక పురస్కారాలు లభించాయి.

పసికందు మృతితో చలించి..

గుంటూరు జీజీహెచ్‌లో 2015లో ఎలుకల దాడిలో ఓ పసికందు మృతిచెందిన ఘటన జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త, నాట్కో ఫార్మా కంపెనీ, నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి మనసును కలిచివేసింది. అప్పటి నుంచి జీజీహెచ్‌కు ఆయన తనవంతు సాయం చేస్తూనే ఉన్నారు. పిల్లల వార్డు అభివృద్ధికి రూ.3కోట్లు ఇచ్చారు. 2020లో రూ. 50 కోట్లతో క్యాన్సర్ సెంటర్ నిర్మించారు. ఇటీవల తన సొంత నియోజకవర్గం పొన్నూరు మండలం మునిపల్లెలో రూ.15 కోట్లతో కంటి ఆస్పత్రిని నిర్మించి ఎల్వీప్రసాద్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నారు. తాజాగా క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి ప్యాలెటివ్ కేర్ చికిత్స అందించేందుకు జీజీహెచ్‌లో రూ.20 కోట్లతో నూతన క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి గురువారం శంకుస్థాపన చేయనున్నారు.

నాట్కో చేసిన అభివృద్ధి పనులు

- 2017లో జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు రూ.25 లక్షల ఖరీదు చేసే వైద్య పరికరాలను నాట్కో ట్రస్టు అందించింది.
- రూ.కోటితో ఓపీ వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు ఆధునీకరించింది.
- 2018లో జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో రూ.కోటితో లామినర్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్, పది పడకలతో ఐసీయూను ఏర్పాటు చేసింది.
- 2023లో డయాలసిస్ యూనిట్‌ను రూ.20 లక్షలతో ఆధునీకరించింది.
- మానసిక వ్యాధుల వైద్య విభాగంలో రూ.10 లక్షలతో సెమినార్ హాలును 2024లో నిర్మించింది.
- నర్సింగ్ స్కూల్, వసతి గృహంలో వసతులు కల్పించింది.

అండగా నిలిచిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

జీజీహెచ్‌లో నిర్మించిన నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను 2020 జూలై 1న అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్సలు అందించేందుకు వైద్య పరికరాలను, వైద్య సిబ్బందిని మంజూరు చేశారు. సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ యూనిట్లు, పీజీ సీట్లనూ మంజూరు చేశారు.

రూ.20 కోట్లతో ప్యాలెటివ్ కేర్



గుంటూరు జీజీహెచ్‌లో తమ ట్రస్టు నిర్మించిన క్యాన్సర్ సెంటర్ ద్వారా విజయవంతంగా ఉచిత సేవలందుతున్నాయి. తాజాగా వంద పడకలతో ఐదు అంతస్తులలో ప్యాలెటివ్ కేర్‌ను రూ. 20 కోట్లతో నిర్మించాలని నిర్ణయించాం. దీనికి గురువారం శంకుస్థాపన జరగనుంది.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్

ఉచిత వైద్యంతోపాటు మందులు



అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో నిర్మించిన నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు ఏటా విదేశీ వైద్యులు సైతం వచ్చి క్యాన్సర్‌పై అధ్యయనం చేస్తున్నారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులకు ఉచిత వైద్యంతోపాటు ఏటా రూ. 2 కోట్ల ఖరీదు చేసే మందులు ఉచితంగా అందజేస్తున్నాం.

– యడ్లపాటి అశోక్‌కుమార్, నాట్కోట్రస్టు కో–ఆర్డినేటర్

నాట్కో సేవలు వెలకట్టలేనివి



నాట్కో ట్రస్టు సేవలు వెలకట్టలేనివి. వివిధ వార్డుల అభివృద్ధికి ఆ ట్రస్టు సాయం చేసింది. ఈ సంస్థను ఆదర్శంగా తీసుకుని మరింతమంది ముందుకు రావాలి.

– డాక్టర్ యశశ్వి రమణ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

క్రీస్తు మార్గంలో సంతోషం

బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్



బైబిల్ మిషన్ మహోత్సవంలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: క్రీస్తు మార్గంలో సంతోషం సిద్ధిస్తుందని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ప్రాంగణంలో జరుగుతున్న బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ క్రీస్తు వాక్యోపదేశం చేశారు.

రజత వార్షికోత్సవం... మహోత్సవం

బైబిల్ మిషన్ అధ్యక్షులు, పెదకాకాని స్వస్థిశాల నిర్వాహకులు రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ మహోత్సవాల నిర్వహణ బాధ్యతను చేపట్టి ఈ సంవత్సరానికి 25 ఏళ్లు పూర్తయ్యాయి. దీంతో రజత వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా కృష్ణాజిల్లా సంగీత బృందం భక్తి కీర్తనలు ఆలపించింది. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు, జాయింట్ సెక్రటరీ రెవరెండ్ జె.ఆగమనరావు వాక్య పరిచర్య చేశారు. మంగళవారం సాయంత్రం రెవరెండ్ జె.వినోద్ కుమార్, పాస్టర్లు జి. శామ్యూల్, వి.సతీష్‌బాబు తదితరులు దైవ సందేశాలు అందించారు.

నేటితో మహోత్సవాలు ముగింపు

బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ ఎం.రవి, రెవరెండ్ డి.ఉజ్జీవం, రెవరెండ్. ఎ.తిమోతి రాజు, పాస్టర్ ఆర్.షాలేమురాజు దైవ సందేశాలు అందిస్తారు. మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ 2025 మహోత్సవాల రిపోర్టును వెల్లడిస్తారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు ఆఖరి ప్రార్థనతో మహోత్సవాలు ముగుస్తాయి.

తోడు దొంగలు..తోడల్లుళ్లు

ఇద్దరి వయసూ ముప్పైరెండే

- ఒకరిపై 50కిపైగా కేసులు
- మరొకరిపై 35కిపైగా..
- ఎర్రచందనం, ఇళ్లల్లో చోరీలు చేయడంలో దిట్టలు
- చోరీ నగదుతో ఇల్లు కొనుగోలు
- అంతరాష్ట్ర పాత నేరస్తులు అరెస్ట్
- రూ.28 లక్షలు విలువైన బంగారం, వెండి ఆభరణాలు, ఆటో, బైక్ స్వాధీనం
- ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో ఏఎస్పీ సుప్రజ తదితరులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆ ఇద్దరు తోడు దొంగలు.. ఆ తర్వాత తోడల్లుళ్లయ్యారు. ఇద్దరి వయసూ ముప్పైరెండే. చోరీలు చేయడంలో ఘనాపాటీలు. అంతర్రాష్ట్ర పాత నేరస్తులు. ఇద్దరిపైనా కలిపి 85కిపైగా కేసులు ఉన్నాయి. ఎట్టకేలకు వీరిద్దరినీ గుంటూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రూ.28 లక్షల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు, ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

ఇటీవల జిల్లాలో ఇంటి దొంగతనాలపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. ప్రస్తుతం గుంటూరు కొత్తపేట సాయిభాస్కర్ ఆస్పత్రి సమీపంలో ఉంటున్న వైఎస్సార్ జిల్లా పొద్దుటూరుకు చెందిన ఆకుల శ్రీను, వైఎస్సార్ జిల్లా చింతగుమ్మదిన్నె మండలం అశ్వతుగారిపల్లికి చెందిన నాగదాసరి మహేష్ ఇళ్ల చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నల్లపాడు, పెదకాకాని, మంగళగిరి, వట్టిచెరుకూరు, గుంటూరు లాలాపేటల్లో వీరు చోరీలకు పాల్పడ్డారని సీసీటీవీ ఫుటేజీ, స్థానికంగా లభ్యమైన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. దీంతో వారిద్దరిని అరెస్ట్ చేసి, సుమారు 318 గ్రాముల బంగారం, 1.5 కిలోల వెండి ఆభరణాలు, ఆటో, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.28 లక్షలు ఉంటుంది. ఇదిలా ఉంటే మరో చైన్ స్నాచర్ తమిళనాడు వెల్లోర్ జిల్లా పెర్నంభట్టు మండలం పస్నీర్‌కొట్టైకు చెందిన చంద్రన్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. అతని ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక పోలీస్ బృందం తమిళనాడు వెళ్లినట్లు తెలిపారు.

అక్కా, చెల్లెళ్లతో పెళ్లి

అరెస్టయిన ఆకుల శ్రీను, నాగదాసరి మహేష్ స్నేహితులు. వీరిద్దరూ లారీడ్రైవర్లు. వచ్చే సంపాదన చాలక చోరీలు మొదలుపెట్టారు. శ్రీనుపై రాష్ట్ర వ్యాప్తంగా 50కిపైగా కేసులు, మంగళగిరి గ్రామీణ పీఎస్‌లో సస్పెక్ట్ షీట్ ఉంది. నాగదాసరి మహేష్‌పైనా సుమారు 35కిపైగా కేసులు నమోదయ్యాయి. గతంలో కడప, చిత్తూరు జిల్లాల్లో ఎర్ర చందనం కేసుల్లో అరెస్టయ్యారు. 2021లో వీరిద్దరూ గుంటూరుకు వలస వచ్చారు. కొత్తపేటలోని సాయిభాస్కర్ ఆసుపత్రి సమీపంలో ఉంటున్నారు. ఇటీవల అదే ప్రాంతంలోని అక్కా చెల్లెళ్లను పెళ్లి చేసుకుని స్థిరపడ్డారు. పగటి వేళల్లో రెక్కీ చేసి, తాళాలేసిన ఇళ్లను గుర్తించి చోరీలు చేయడం వీరి నైజం. శ్రీను స్క్రూడ్రైవర్‌తో బీరువా తాళాలు తీయడంలో నేర్పరి. అతను లోపల చోరీ చేస్తుంటే మహేష్ కాపలా ఉంటాడు.

రూ.9 లక్షలతో ఇల్లు కొనుగోలు

కృష్ణా జిల్లా కృత్తివెన్ను పీఎస్ పరిధిలో చోరీకి పాల్పడిన బంగారాన్ని గుంటూరు లాడ్జికూడలి, బ్రాడీ పేటలోని ఓ గోల్డ్ ఫైనాన్స్ సంస్థలో విక్రయించగా వచ్చిన రూ.9 లక్షలతో శ్రీను వట్టిచెరుకూరు మండలం అనంతవరం గ్రామంలో ఇల్లు కొన్నట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఈ ఇంటిని కూడా కేసులో అటాచ్‌మెంట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, సీఐలు సుబ్బారావు, అల్తాఫ్‌హుస్సేన్, బత్తుల శ్రీనివాస్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,700 గరిష్టం : రూ. 3,400

మోడల్ ధర రూ. 3,100

ఫిబ్రవరి 19, 20 తేదీల్లో ఆక్వా కల్చర్‌పై జాతీయ సదస్సు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య వి.వెంకటరత్నమ్మ తెలిపారు. మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రీసెంట్ డెవలప్‌మెంట్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వీరయ్య, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి.పద్మావతి, విభాగం అధ్యాపకులు ఆచార్య పీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జర్నలిస్ట్ బీఎల్ నారాయణ

- ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా
- కామ్రేడ్ తుమ్మల వెంకట్రామయ్య స్మారక సాహితీ పురస్కారం ప్రదానం



బీఎల్ నారాయణకు పురస్కారాన్ని అందజేస్తున్న బాబు ఆర్.వడ్లమూడి, పెనుగొండ, సాయిమాధవ్

తెనాలిఅర్బన్: విలువలు పాటించే ఉత్తమ జర్నలిస్టు బీఎల్ నారాయణ అని ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ తుమ్మల వెంకట్రామయ్య స్మారక సాహితీ పురస్కారం-2025 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని తెనాలి గాంధీనగర్ కవిరాజు పార్కులోని వడ్లమూడి గోపాలకృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్స్ భవనంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి చేతుల మీదుగా బీఎల్ నారాయణకు తుమ్మల వెంకట్రామయ్య సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాయిమాధవ్, డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి మాట్లాడుతూ నారాయణ రాసే కథనాల్లో వాస్తవికత ప్రతిబింబిస్తోందని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం అఖిల భారత అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ సాహితీ, సాంస్కృతిక యోధుడు నారాయణ అని కితాబిచ్చారు. బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని స్వాగతం పలికిన సభలో తెనాలి ప్రముఖులు డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి, ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ కె.రవిబాబు, 'వివేక' డెరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్, సామల లక్ష్మణబాబు, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, చల్లా గురునాథరావు, గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొని నారాయణను సత్కరించారు.

తపాలా శాఖ ఆర్థికంగా బలోపేతం కావాలి

కేంద్ర మంత్రి పెమ్మసాని

మంగళగిరి (తాడేపల్లి రూరల్): తపాలా శాఖను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో వనరులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. కుంచనపల్లి, యర్రబాలెంలో ఉన్న తపాలా కార్యాలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖల ఆదాయం ఎలా పెంచాలో ఉద్యోగులకు వివరించారు. కాస్ట్ సెంటర్ నుంచి ప్రాఫిట్ సెంటర్‌గా ఎలా చేయాలనే అంశంపై పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. గ్రౌండ్ రియాల్టీ తెలుసుకునేందుకు ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు సేకరించామన్నారు. ఉద్యోగుల జీతాలు, ఇన్‌సెంటివ్‌లు సకాలంలో అందుతున్నాయో లేవో అడిగి తెలుసుకున్నారు. తపాలా శాఖకు ప్రస్తుతం రూ.13 వేల కోట్ల ఆదాయం ఉంటే ఖర్చులు రూ.35 వేల కోట్లు ఉన్నాయని, ఈ క్రమంలో ప్రతి ఒక్క ఉద్యోగి తపాలాశాఖ ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు ఆంధ్రప్రదేశ్ సర్కిల్ సీపీఎంజీ కె.ప్రకాష్, పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీ ఆర్.మూర్తి, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సహా ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్) ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సోమవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో ఏడుగురు ఉపాధ్యాయులు సెలవులో ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో జరిగిన ఘటనపై డీఈఓ రేణుక తెనాలి ఎంఈవోతో విచారణ జరిపించారు. ఎంఈఓ నివేదిక ఆధారంగా మూకుమ్మడి సెలవులు పెట్టిన ఏడుగురు ఉపాధ్యాయులతోపాటు ఎఫ్ఏ-3 పరీక్షలు ఉన్నప్పటికీ అంతమంది ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేసిన హెచ్‌ఎంకూ సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేశారు. దీనిపై సంబంధిత హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రెండు రోజుల్లో వివరణ ఇచ్చిన తరువాత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈఓ రేణుక తెలిపారు.

రాజధాని ప్రాంతంలో దొంగలు హల్‌చల్

- అర్ధరాత్రి పలు గ్రామాల్లో చోరీలు
- సీసీ ఫుటేజీలలో రికార్డు
- అప్రమత్తమైన పోలీసులు
- అనుమానితులపై సమాచారం ఇవ్వాలని వినతి



కారులో పరారవుతున్న దొంగలు

తాడికొండ: రాజధాని ప్రాంతమైన తుళ్ళూరు మండలంలో దొంగలు హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి సమయంలో తుళ్ళూరు మండలం దొండపాడు, బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడి గ్రామాల్లో చేతిలో మారణాయుధాలతో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడినట్లు సీసీ టీవీ ఫుటేజీల్లో రికార్డయింది. 26వ తేదీ అర్ధరాత్రి ఈ చోరీలు జరిగాయి. దొండపాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు కొమ్మినేని అప్పారావు, ఇంట్లో వెండి, బంగారం ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. బోరుపాలెం, రాయపూడి గ్రామాల్లో దుకాణాల్లోని నగదు అపహరించారని బాధితులు చెబుతున్నారు. ఒక కారు, బైక్‌పై వచ్చిన దుండగులు యథేచ్ఛగా చోరీలు చేయడంతో రాజధాని గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

గాలింపు చర్యలు చేపట్టాం

దొంగలను పట్టుకునేందుకు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు వాడిన కారు నంబరు తెలుసుకునేందుకు యత్నిస్తున్నామని, త్వరలోనే దుండగులను పట్టుకుంటామని పేర్కొన్నారు. చోరీలకు పాల్పడిన వారు ఆకతాయిలా లేక దొంగలా అనేది స్పష్టం కాలేదన్నారు. రాజధాని ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో కొత్త వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోలవాన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 100, 112 లేదా తన నంబర్ 9440900860కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రాయపూడిలోని ఓ ఇంటిలో నిద్రిస్తున్న భార్యభర్తల ఫోన్ తీసుకెళ్ళారని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పిన సీఐ దొండపాడు, బోరుపాలెం గ్రామాల్లో జరిగిన చోరీల గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం.